క్లుప్తంగా

శ్రీనివాసపురం సర్పంచ్‌గా రాధిక ప్రమాణస్వీకారం


సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న యడ్లపల్లి రాధిక

జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురం సర్పంచ్‌గా యడ్లపల్లి రాధిక బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి సర్పంచ్ రాధికచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమె మాట్లాడుతూ తన భర్త దుర్గారావు సర్పంచ్‌గా పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలనే ఆశయ సాధనతో ఉండేవాడని, ఆయన ఆశయ సాధనలో పయనిస్తూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని అన్నారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవికి వైద్యసేవలు

చింతలపూడి : మూగ జీవికి వైద్యం అందించడానికి పశువైద్యాధికారులు ముందుకు రావడం పట్ల పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో బుధవారం ఉదయం పాడి గేదె కదలలేని పరిస్థితుల్లో మెయిన్ రోడ్డుపై పడి ఉంది. స్థానికులు సోషల్ మీడియాలో పశువు పరిస్థితి గురించి పోస్టు పెట్టడంతో విషయం తెలుసుకున్న పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.లింగయ్య స్పందించారు. పాడి గేదెను పరిశీలించిన పశు వైద్యులు వాహనం ఢీకొట్టి ఉండవచ్చునని భావించారు. గేదెను 104 వాహనంలో తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు.

హెచ్ఐవీ నిర్మూలనలో భాగస్వాములు కండి


ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రెడ్ రన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

చింతలపూడి : హెచ్ఐవీని దేశం నుంచి తరిమికొట్టడానికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.ఎ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు ఎయిడ్స్‌పై విస్తృత ప్రచారంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం రెడ్ రన్ అనే కార్యక్రమం నిర్వహించారు. రెడ్ రన్ ద్వారా యువతకు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే హెచ్ఐవీపై అవగాహన పెంచుకుంటే ఎయిడ్స్ వంటి మహమ్మారి బారిన పడకుండా కాపాడుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ జీవన మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు యాత్రకు సీపీఐ సంఘీభావం

కామవరపుకోట : దేశ ప్రధాని నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో వైజాగ్ నుంచి బస్సు యాత్ర చేపట్టినట్లు సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు తెలిపారు. జంగారెడ్డిగూడెం చేరుకున్న ఈ బస్సు యాత్రకు సంఘీభావంగా కామవరపుకోట మండల పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మోటారు సైకిల్ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న విధానాలను దుయ్యబట్టారు.

నోట్‌పుస్తకాల పంపిణీ


నోట్ పుస్తకాలు అందజేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురంలో ఎంపీపీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు రూ.15 వేల విలువైన నోట్ పుస్తకాలు అందజేశారు. ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్, ట్రాన్స్ ఇండియా సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే టెన్త్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు, రూ.2,500, రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకాలను జీలకర్రగూడెం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ అందజేశారు.

శాశ్వత భూహక్కుపై సర్వే

బుట్టాయగూడెం : గ్రామాల్లో ప్రతి ఆస్తిని సర్వే చేసి వివాదాలు లేకుండా కొలతలు తీసుకోవాలని, సర్వేను పూర్తి చేయాలని జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓ రజాఉల్లా అన్నారు. బుట్టాయగూడెం మండలంలో ఎంపికైన 8 పంచాయతీల పరిధిలో శాశ్వత భూహక్కు – భూరక్ష, స్వమిత్ర కార్యక్రమం అమలుపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తయిన అనంతరం గ్రామ సభల్లో యాజమాన్య హక్కుపత్రాలను పంపిణీ చేస్తారన్నారు. భూహక్కు – భూరక్ష పథకంలో చేపడుతున్న రీసర్వేలో గ్రామ కంఠాల సర్వే అత్యంత కీలకమని అన్నారు. ప్రతి స్థాయిలో జరిగే సర్వేలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ శ్రీహరి, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్‌-3 విజయోత్సవ సంబరాలు

కొయ్యలగూడెం : చంద్రయాన్‌-3 విజయవంతం కావడంపై సంబరాలు అంబరాన్నంటాయి. ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి హర్షం వ్యక్తం చేశారు. చంద్రయాన్ – 3 విజయవంతం ఇస్రో శాస్త్రవేత్తల ఘన విజయంగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. ఇస్రో నుంచి ప్రయోగించిన రోవర్ చంద్రమండలం దక్షిణ ధ్రువానికి చేరుకోగానే 140 కోట్ల మంది భారతీయుల ఆనందాలకు అవధులు లేకుండా పోయాయన్నారు. భారత దేశ శాస్త్ర సాంకేతిక పాటవాన్ని ప్రపంచ దేశాలకు చాటడంలో ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఎంతగానో ఉందని వారి రుణం భారతీయులు తీర్చుకోలేరని అన్నారు. భారత్ కన్నా ముందు అమెరికా, రష్యా, చైనా, జపాన్‌లు చంద్రయాన్ కార్యక్రమానికి వెచ్చించిన దానికన్నా తక్కువలో భారత్ ఖర్చు చేసి అగ్రగామిగా నిలిచిందన్నారు. భారత జాతి యావత్తు ఇస్రో శాస్త్రవేత్తలకు తలవంచి నమస్కరిస్తోందంటూ బాలరాజు ఆనందం వ్యక్తం చేశారు. తొలుత చంద్రయాన్‌-3 విజయవంతం కావాలంటూ బుధవారం ఉదయం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బోడిగూడెం గ్రామంలో సర్పంచ్ కడకట్ల గడ్డియ్య ఆధ్వర్యంలో జయహో చంద్రయాన్‌-సాహో ఇస్రో అంటూ బాలరాజు జయ జయ ధ్వానాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి, ఎస్సై జీజే విష్ణువర్ధన్, ఎంఈఓ జె.సురేష్ బాబు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు ఏలేటి చిన్న తుక్కయ్య, ఎంపీటీసీలు జాన్ డేవిడ్ కింగ్, తేలే శ్రీను, సంకుకొండ, చిడిపి రవి తదితరులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం : బోడిగూడెంలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, ప్రజాప్రతినిధులు


ద్వారకాతిరుమల : పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇస్రో ఆకృతిలో విద్యార్థులు

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

ద్వారకాతిరుమల : చంద్రయాన్‌- 3 ల్యాండింగ్ విజయవంతం కావడంతో పంగిడిగూడెం జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇస్రో ఆకృతిలో కూర్చుని తమ అభిమానాన్ని చాటారు.

విజయోత్సవ సంబరాలు

చింతలపూడి : చింతలపూడిలో బుధవారం చంద్రయాన్‌-3 విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. పట్టణ ప్రజలు ప్రధాన సెంటర్‌లో జాతీయ జెండాలను చేతబట్టి విజయోత్సవ నినాదాలు చేశారు. ర్యాలీ నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేశారు. చంద్రయాన్‌-3 ద్వారా చందమామ దక్షిణ ధృవంపై అడుగు పెట్టి ఎవరికి సాధ్యం కాని దానిని సుసాధ్యం చేసిన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

కుక్కునూరు : చంద్రయాన్‌-3 ప్రయోగంలో విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధృవం పై విజయవంతంగా అడుగుపెట్టిన వేళ మండల ప్రజలు సోషల్‌మీడియా వేదికగా శుభాకాంక్షలతో హోరెత్తించారు. ల్యాండింగ్ దృశ్యాలను టీవీలలో ప్రత్యక్ష ప్రసారం చేయడంతో ప్రజలు టీవీల ముందు కూర్చొని ఉత్కంఠగా ఎదురుచూశారు. చివరి దశలో విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా ల్యాండ్ అవ్వడంతో ప్రజలు గర్వంగా జయహోభారత్ అంటూ మెసేజ్‌లు పంపుతూ ఇస్రో సైంటిస్ట్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

కామవరపుకోట : చంద్రయాన్ 3 విజయవంతంగా కక్షలోకి ప్రవేశపెట్టినందుకు శాస్త్రవేత్తలకు మద్దతుగా మండలంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేసి సంబరాలు జరుపుకున్నారు. తడికలపూడిలో జెడ్పీటీసీ కడిమి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయి పంచారు. కామవరపుకోట గ్రామస్తులు చౌతనా సెంటర్ నుంచి దుర్గా మహల్ పాత సినిమా హాల్ సెంటర్ చెక్ పోస్ట్ సెంటర్ బస్టాండ్ సెంటర్లలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. భారత్ మాతాకీ జై అంటూ దేశభక్తిని చాటుతూ ర్యాలీ నిర్వహించారు జెడ్పీటీసీ కడిమి రమేష్ మాట్లాడుతూ జాబిల్లిపై విక్రమ్ సురక్షితంగా ల్యాండ్ అవ్వడం దేశానికే గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపీటీసీ గంగుల కడియాలు, కొప్పర్తి లక్ష్మి, జయవరపు ప్రసాద్, వీరమల్ల మధు, కిషోర్, పవన్ నందూరి భాను, ముల్లగిరి యుగంధర్, మేడూరు వసు, వేముల జగన్, నిజపరపు దుర్గాప్రసాద్, సిరిగినేటి తారక శ్రీనివాసరావు,, మణికంఠ, కౌశిక్, ముత్యాలరావు, జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం కావాలని పూజలు

జంగారెడ్డిగూడెం : చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రయాన్ విజయవంతమై దేశ ఖ్యాతి ప్రపంచ దేశాలకు చాటాలని ప్రతి భారతీయుడి ఆకాంక్ష అని పరిషత్ సభ్యులు కేవీఆర్.సత్యనారాయణ అన్నారు. బీకే విశ్వనాథ్, తోట రామకృష్ణ, కొనకళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


చింతలపూడి : చంద్రయాన్‌-3 విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


కామవరపుకోట : విజయోత్సవ సంబరాల్లో యువకులు


కామవరపుకోట : కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ రమేష్


జంగారెడ్డిగూడెం వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు

ఆంధ్రకేసరి పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

చింతలపూడి : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదివి అనుసరించాలని మండల పరిషత్ అధ్యక్షుడు డా. బి రాంబాబునాయక్ అన్నారు. బుధవారం ప్రకాశం పంతులు జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు జీవిత చరిత్రను వివరించారు. ఆంధ్రకేసరి పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో టంగుటూరికి నివాళి

టి.నరసాపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో టంగుటూరు ప్రకాశం పంతులు 151 జయంతిని బుధవారం నిర్వహించారు. గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాఠకులు మాట్లాడుతూ తెల్లవాడికి గుండెలు ఎదురొడ్డి ధైర్యంగా నిలబడి తెలుగువాడి పౌరుషాన్ని చూపిన మహనీయుడు, స్వాతంత్య్ర సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, కమిటీ సభ్యులు, గ్రంథాలయాధికారి పాల్గొన్నారు.


చింతలపూడి : టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాంబాబు నాయక్


కొయ్యలగూడెం : బోడిగూడెం హైస్కూల్లో గిడుగు రామ్మూర్తి, టంగుటూరి జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి శ్రీటంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు ధారావతు మల్లేష్ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుడిగా, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు రాష్ట్రానికి చేసినటువంటి సేవలను వివరించారు. బ్రిటిష్ వారికి ఎదురునిలిచి తన గుండెను చూపించి కాల్చమని ధీరత్వాన్ని ప్రదర్శించిన గొప్ప దేశభక్తి పరుడు టంగుటూరి అని కొనియాడారు. కళాశాల సిబ్బంది అన్నపూర్ణమ్మ, రత్నసిరిలో, విద్యార్థులు పాల్గొన్నారు.

గిడుగు, టంగుటూరికి నివాళులు

కొయ్యలగూడెం : తెలుగు భాషా వ్యవహారిక ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి వారోత్సవాలు, అదేవిధంగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి బోడిగూడెం హైస్కూల్లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి హాజరై ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రకాశం పంతులు ఆంధ్రకేసరి బిరుదు పొందడానికి గల కారణాలు, గిడుగు రామ్మూర్తి పంతులు చేపట్టిన భాష ఉద్యమం విద్యార్థులు తెలుసుకోవలసిన అవసరం ఉందని జెడ్పీటీసీ అన్నారు. సర్పంచ్ కడకట్ల గడ్డియ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.బేబీశ్రీలక్ష్మి, ఎంఈఓ జె.సురేష్‌బాబు ఉపాధ్యాయులు ఎన్‌వీ రామారావు, ఊటుకూరి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మంగపతిదేవిపేట ఎంపీటీసీ తేలే శ్రీను, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

జంగారెడ్డిగూడెం రూరల్ : తిరుమలాపురం ఎంపీపీ పాఠశాల విద్యార్థి కంటి ఆపరేషన్‌కు ఆర్థిక సహాయం అందజేశారు. ఐదో తరగతి చదువుతున్న ఆకుల అనూష కంటికి ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. అనూష తల్లిదండ్రుల ఆర్థిక స్తోమత విషయం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ఈడా నరేష్ తన మిత్రుల సహకారంతో రూ.19,600 నగదును సమకూర్చి వారికి అందజేసి మానవత్వం చాటుకున్నారు.

బీఎల్‌వోలతో సమావేశం

చింతలపూడి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం చింతలపూడి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జి.సూర్యనారాయణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఎస్ఆర్ 2024, ఇంటింటి వెరిఫికేషన్ కార్యక్రమంపై బీఎల్‌వోలను ఆయన అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తి చేసి, ఓటరు నమోదు, తొలగింపు, చేర్పులు వంటి ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణజ్యోతి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కామేశ్వరి పాల్గొన్నారు.

స్కీం వర్కర్లకు కనీస వేతనాలివ్వాలి

కుక్కునూరు : స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ మండల కమిటీ సమావేశం సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో కుంజా నాగలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు సేవలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుస్తూ, తల్లి.బిడ్డ సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న అంగన్‌వాడీ, ఆశ, యానిమేటర్ వర్కర్లు చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీలకు నాణ్యత కలిగిన యూనిఫామ్‌ను ఇవ్వాలని, యానిమేటర్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి, 5జీ ఫోన్లు ఇవ్వాలని, స్కీం వర్కర్లకు ప్రతి నెలా ఒకటో తేదీన గౌరవ వేతనాలు ఇవ్వాలని, బకాయి వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు మేడవరపు రమాదేవి, కుర్రగేసి, కణితి మంగ, వర్స మంగ, బురం శ్రావణి, దుర్గమ్మ, అమ్మోజి, ఆదిలక్ష్మి, రత్నకుమారి, నాగదేవి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


సీఐటీయూ సమావేశంలో మాట్లాడుతున్న యర్నం సాయికిరణ్

ఉపాధ్యాయులకు ఆంగ్ల భాష ప్రావీణ్యతపై శిక్షణ

జంగారెడ్డిగూడెం : ఉపాధ్యాయులు ఆంగ్ల భాషపై పట్టు సాధించి విద్యార్థులకు బోధన చేయాలని కొయ్యలగూడెం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి రామన్న దొర అన్నారు. జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం ఆంగ్ల ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. డిగ్రీకళాశాల ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్, ఐక్యూఏసీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో రామన్న దొర మాట్లాడుతూ నేడు ఆంగ్ల భాషపై పట్టు చాలా అవసరం అన్నారు. ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా ఉంటూ ఆంగ్లభాషలో ప్రావీణ్యతను పొందాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కై కలూరు, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ పంకజ్ కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, పి.సన్యాసిరావు రిసోర్స్ పర్సన్స్‌గా వివిధ అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొయ్యలగూడెం డివిజన్‌లోని జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాలలోని ఉన్నత పాఠశాలల పనిచేయుచున్న ప్రభుత్వ, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని 75 మంది ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఈఓ రామన్న దొర

గిరిజనుల సాగు భూములకు పట్టాలివ్వాలి

బుట్టాయగూడెం : గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా నాయకులు తెల్లం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో వేల ఎకరాల్లో గిరిజనులు సాగు చేస్తున్నారని వారి పేర్లు అడంగల్‌లో నమోదు చేయడం లేదని అన్నారు. గిరిజనులు ఎల్‌టీఆర్, 1/70 పోడు భూములు సాగు చేస్తున్నారని చెప్పారు. ఆ భూములకు పట్టాలివ్వాలని కోరారు. అనంతరం ఒక వినతిపత్రాన్ని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజకు అందజేశారు. ఈ సందర్భంగా పీఓ గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు పోలోజు నాగేశ్వరరావు, తెల్లం దుర్గారావు, బొరగం భూచంద్రం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, గుడెల్లి వెంకట్రావు, చుంద్రు బుల్లెమ్మ, కోర్సా జలపాలు, వెట్టి వీరయ్య పాల్గొన్నారు.


కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం


ఎస్సీ, బీసీ వర్గాలకు ప్రాధాన్యత

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- బోడిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

కొయ్యలగూడెం : ఎస్సీ, బీసీ వర్గాల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. ఓసీలలో వెనుకబడిన 18 కులాల వారిని బీసీలుగా చేసిన ఘనత మహానేత వైఎస్సార్‌కు దక్కితే ఎస్సీ బీసీ కులాల వారికి అత్యున్నత పదవులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. బోడిగూడెం గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడారు. పద్దెనిమిది కులాల వారికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి జగన్ బాటలు వేశారని తద్వారా బోడిగూడెం గ్రామ పంచాయతీతో పాటు గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 18 కులాలు లబ్ధి పొందాయన్నారు. బీసీలను ఉద్ధరించామని ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబు ఏనాడైనా రాజ్యసభకు ఒక్క బీసీని అయినా పంపారా అని ప్రశ్నించారు. అదే యువనేత జగన్‌మోహన్‌రెడ్డి అయితే రాజ్యసభతో పాటు అత్యధిక స్థానాలలో బీసీలను ఎంపీలుగా చేసి ఆయా వర్గాల పట్ల చిత్తశుద్ధి చాటారన్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లు ప్రధాన సమస్యగా ఉందని దీనికి రెండు నెలలలో పరిష్కార మార్గం చూపుతామని ఎమ్మెల్యే బాలరాజు ప్రజలకు హామీ ఇచ్చారు. సీసీ రోడ్లు డ్రెయినేజీలను నిర్మిస్తామని అన్నారు. కొద్ది నెలల క్రితం మృతి చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పారు. బోడిగూడెం పంచాయతీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఎంపీటీసీ గంటా శ్రీనును నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, ఎంపీటీసీ జాన్ డేవిడ్ కింగ్, పార్టీ నాయకులు తేలే నాగ భూషణం, వాసుబోయిన సత్యనారాయణ, చల్లా సుబ్బారావు, వల్లూరి పోలేశ్వరరావు, జక్కు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

విశాఖ ఉక్కును కాపాడుకుందాం


బహిరంగ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

జంగారెడ్డిగూడెం : విశాఖ హక్కును ప్రైవేటుపరం కాకుండా కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ప్రభుత్వాల పాలనకు వ్యతిరేకంగా రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర బుధవారం జంగారెడ్డిగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా జేపీ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభకు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షత వహించారు. తొలుత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు నాయకులను బహిరంగ సభ వేదిక పైకి ఆహ్వానించారు. ఈ బహిరంగ సభలో కె.రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ 922 రోజుల నుంచి 33 కార్మిక సంఘాలు పోరాటం చేస్తున్నా ప్రధాని మోదీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగంలోనే విశాఖ ఉక్కును కొనసాగిస్తానని మోదీ నేటికీ హామీ ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావుల రవీంద్రనాథ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా చంద్రయాన్‌-3 విజయవంతంపై రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com